క్లుప్తంగా

ఘనంగా మాస శివరాత్రి పూజలు



ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ బీసీ గేటు సమీప పర్వత వర్ధని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మాస శివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామున మహా శివునికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ఈనెల 27న జరగనున్న బీఎఫ్–3 ప్రారంభోత్సవం విజయవంతం కావాలని పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామికి, నవగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం వల్లప దాసు గోపాలకృష్ణ, జ్యోత్స్నాదేవి దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది.

అమ్మ పేరుతో మొక్క కార్యక్రమానికి శ్రీకారం



సామాజిక భవనం ప్రాంగణంలో మొక్క నాటుతున్న కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: అమ్మ పేరుతో మొక్క నాటాలనే ఆలోచన అద్భుతమని బీజేపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పెదగంట్యాడలోని బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలోని సామాజిక భవనం ప్రాంగణంలో మొక్క మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమిస్తే.. అది సంపూర్ణ ఆరోగ్యాన్ని సిద్ధింపజేస్తుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటితే సరిపోదని వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు. అనంతరం ఒక్కొక్కరు పాఠశాల ఆవరణలో బాదం, జామ, మామిడి, వేప, కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మనోహర్, రంగనాయకులు, రాజు, హేమంత్, రామచంద్ర, శ్యామ్, పెంటారావు, కన్నారావు పాల్గొన్నారు.

మూలకు చేరిన ఏటీఎంలు



పనిచేయని ఏటీఎం, పార్ట్‌లు విప్పేసి వదిలేసిన ఏటీఎం

అగనంపూడి: అగనంపూడిలోని భారతీయ స్టేట్ బ్యాంక్ ఏటీఎంలు మూలకు చేరాయి. కొద్ది రోజులుగా ఇక్కడ ఏర్పాటు చేసిన ఏటీఎంల్లో ఒకటి పనిచేయకపోగా, మరో ఏటీఎం పార్ట్‌లు విప్పేసి చెల్లా చెదురుగా పడి ఉండడంతో ఏటీఎంకి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. పెన్షనర్లు, సాధారణ ఉద్యోగులు, అత్యధిక నిర్వాసితులు ఏటీఎంపై ఆధారపడి డబ్బులు విత్‌డ్రా చేసుకుంటున్నారు. అయితే అగనంపూడిలో ఉన్న ఏకైక ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో రెండు మిషన్లు కూడా మూలకు చేరడంతో ఎస్‌బీఐ ఖాతాదారులు మండిపడుతున్నారు. ఒకటి కాకపోతే ఒకటైనా పనిచేస్తుందని ఎంతో ఆశతో వచ్చేవారికి నిరాశ మిగులుతుండడంతో సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

యువతకు ఉచితంగా ఉపాధి శిక్షణ

గాజువాక: ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన 18 నుంచి 28 ఏళ్ల లోపు యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు నిర్మాణ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జావా ఫుల్‌స్టాక్, టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటింగ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎఫ్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నాలజీ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్‌లో మూడు నెలలపాటు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆ తర్వాత ఉచితంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 9154938478, 9154938472 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.


మట్టిపై మమకారం!

మృణ్మయ పాత్రలకు మళ్లీ ఆదరణ



కుండల నుంచి పాత్రల వరకూ గిరాకీ







మట్టి కుండలు, పాత్రల వినియోగం ఆరోగ్యానికి కూడా మంచిదని వైద్యులు చెప్పడంతో వాటికి ఆదరణ పెరిగింది. మట్టి పాత్రల్లో వంట చేసి తింటే చక్కెరవ్యాధి అదుపులో ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. అంతే కాకుండా ఆ పాత్రల్లో వండే వంటలు ఎక్కువ కాలం నిల్వ ఉండడంతో పాటు మంచి రుచిగా కూడా ఉంటాయంటున్నారు. ప్రధానంగా మనిషి ఆరోగ్యానికి అవసరమైన మైక్రోన్యూక్లియన్స్ మట్టిలో ఉన్నట్లు సాంకేతిక పరిశోధనలు చెబుతున్నాయి.

రుచిలో మేటి

సిల్వర్, స్టెయిన్‌లెస్ స్టీల్, పింగాని, అల్యూమినియం వంటి పాత్రల్లో వండిన వంటకాలకు.. మట్టికుండల్లో వండిన వంటకాలకు ఎంతో తేడా ఉంటుందని ఆరోగ్య నిపుణులు సైతం పేర్కొంటున్నారు. మామూలు పాత్రలో వండిన ఆహారపదార్థాల్లో కేవలం ఏడు నుంచి 13 శాతం మైక్రోన్యూట్రియన్స్ ఉంటే... మట్టి పాత్రల్లో చేస్తే మాత్రం వందకు వంద శాతం న్యూట్రియన్స్ ఉంటాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ పాత్రలు తయారు చేయడానికి ఉపయోగించే మట్టి వల్ల కూడా మరిన్ని ప్రయోజనాలు ఉన్నాయని పెద్దలు చెబుతున్నారు. జిగురు మట్టి నిల్వ ఉంచినచోట ఇన్విజబుల్ రేస్ ఉత్పత్తి అవుతాయి.అవి ఆప్రాంత మంతా వెదజల్లడం వల్ల పరిసరాలు శుద్ధి అవుతాయని.. ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు తక్కువగా ఉంటాయని పరిశోధకులు పేర్కొంటున్నారు.



వృత్తి పని వారికి ఉపాధి

మట్టి కుండలు, పాత్రలు వినియోగం తగ్గి పోవడంతో వడ్లపూడి చాకలి వీధిలో నివావసం ఉంటున్న కుమ్మర్లు ఈ వృత్తికి దూరమయ్యారు. కూలీ నాలీ చేసుకొని జీవనానికి అలవాటు పడి చెల్లా చెదురైపోయారు. కొంతమంది మాత్ర ఈ పని తప్పా మరో పని చేతకాక పోవడంతో చిన్న చిన్న బొమ్మలు, ప్రమిదలు తయారు చేసుకొని ముందుకు సాగుతున్నారు. ఈ సమయంలోనే మట్టి పాత్రలకు ప్రాముఖ్యత ఏర్పడడం, చక్కెర వంటి వ్యాధులకు మట్టి పాత్రల్లోని వంటలు మంచి మేలు చేస్తున్నాయని నిపుణులు పేర్కొనడంతో ఆ వృత్తిలో ఉన్నవారికి మళ్లీ ఆశలుచిగురించాయి. అందుకు అనుగుణంగానే పూర్వం వినియోగంలో ఉన్న మట్టి వస్తువులన్నీ తయారు చేస్తున్నారు. కుండలు ,కూజాలు, ప్రమిదలు,పిల్లలు డబ్బులు దాచుకొనేందుకు హుండీలు తయారు చేసి అమ్మకానికి పెడుతున్నారు. ఇప్పుడిప్పుడే వాటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపడంతో ఆ వృత్తిలోఉన్నవారికి ఆశలు చిగురిస్తున్నాయి.

నాడు తిరస్కరణ.. నేడు ఆదరణ



మట్టిపాత్రల వినియోగం వల్ల ప్రయోజనాలు తెలుసుకున్న వారంతా మళ్లీ వాటి వినియోగానికి మొగ్గు చూపుతున్నారు. దీంతో తయారీదారులు కూడా వినియోగదారులను ఆకట్టుకునేలా కుండలు, పాత్రలు, కూజాలు సిద్ధం చేస్తున్నారు. ఒకప్పుడు వీటిని తిరస్కరించిన వారంతా.. ఎక్కడున్నాయో వెతుక్కుని మరీ కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు.



ఇంటికి వచ్చి కొంటున్నారు



మట్టి కుండలను ఎవరూ కొనుగోలు చేయక పోవం వల్ల చాలా మంది వృత్తికి దూరం అయ్యారు. మాలాంటి కొద్ది మంది పాత్రలు మానేసి బొమ్మలు, ప్రమిదలు తయారుచేసి అమ్ముతూ వచ్చాం. ఇప్పుడిప్పుడే కుండల కోసం ఇతర ప్రాంతాల వారు సైతం ఇంటికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మట్టి పాత్రలకు ఆదరణ పెరుగుతోంది.

ఎస్.పార్వతి, మట్టి పాత్రల తయారీ దారు

మట్టి దొరకడమే ఇబ్బంది



పాత్రలు తయారు చేయాలంటే జిగటమట్టి ఉండాలి. ఆ మట్టి కావాలంటే తానాం ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుంది.అయితే ఇప్పుడిప్పుడే మట్టి కుండలు, ఇతర వస్తువులకు గిరాకీ పెరిగింది. వారి అభిరుచికి తగ్గట్టుగా పాత్రలు తయారు చేసి అందిస్తున్నాం. కొంత మంది నేరుగా మా ప్రాంతానికి వచ్చి కావాల్సిన మట్టి కుండలు, పాత్రలు కొనుగోలు చేస్తున్నారు.

సతీష్‌కుమార్, కుండల వ్యాపారి

జీఎం దృష్టికి ఉక్కు టౌన్‌షిప్ సమస్యలు



స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పెరిగిపోతున్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని 78వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టౌన్‌షిప్ క్లస్టర్లలో జంగిల్ కటింగ్ సక్రమంగా లేకపోవడం, కటింగ్ చేసిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో క్వార్టర్లలోకి పాములు చొరబడి కాటు వేస్తున్నాయన్నారు. రెండు రోజుల కిందట సెక్టార్–11లో నివాసం ఉంటున్న తగరంపూడి శ్రీనివాసరావు పాము కాటుకు గురై మరణించడం భాదాకరమన్నారు. చెత్త కుండీలు క్రమం తప్పండా శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్యం లోపిస్తుందని వివరించారు. దోమలు, కీటకాల నిర్మూలన చేయాల్సిన మలేరియా విభాగం సేవలు నిలిచి పోయాయన్నారు. టౌన్‌షిప్‌లోని 56 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదని.. వాటి నిర్వహణ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లో హోంగార్డులను తగ్గించడం వల్ల తగిన నిఘా కొరవడిందన్నారు. టౌన్‌షిప్ నివాసుల ఆరోగ్యానికి, ప్రాణాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుల వి.వి. రమణ పాల్గొన్నారు.

వైభవంగా రథాలమ్మ ఉత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న చింతలపూడి



రథాలమ్మకు పూజలు చేస్తున్న శ్రీనివాస్ దంపతులు

కూర్మన్నపాలెం: గ్రామ దేవత రథాలమ్మను ఉత్సవాన్ని మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. చీరలు,సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

దర్శంచుకున్న ప్రముఖులు

అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, 87వ వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు ఇల్లపురాము, దానప్పలు, ప్రగడవేణుబాబు తదితరులు దర్శించుకున్నారు. అలాగే 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాస్, రమాదేవి దంపతులు రథాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. సిరిమానోత్సవం



సిరిమాను రథం వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్ తదితరులు



సిరిమాను వద్ద ఆలయ కమిటీ పెద్దలతో గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: వడ్లపూడి వాసుల ఆరాధ్య దేవత రథాలమ్మ ఉత్సవం మంగళవారం రాత్రి అంగరంగవైభవంగా సాగింది. మేళతాళాలు, భాజా భజంత్రీలు నడుమ రామాలయం వద్ద రాత్రి 9 గంటల ప్రాంతంలో సిరిమాను రథం కదిలింది. సిరిమానును పూజారి ప్రగడ అప్పలనాయుడు అధిరోహించగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ముందుకు నడిపించారు. వేలాదిమంది భక్తులు హర్షధ్వానాల మధ్య జరిగిన కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఇతర ప్రముఖులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రథం ముందు పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, నాయకులు కోమటిశ్రీను,గుడివాడ లతీష్,ప్రగడ వేణు, బొడ్డగోవింద్,దానప్పలు తదితరులు రథాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, కళారూపాలు ఆకట్టుకున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలో మరెక్కడా లేని విధంగా వడ్లపూడిలో సిరిమానోత్సవం జరగడంతో వివిధ ప్రాంతాల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు.



పురవీధుల్లో సిరిమానోత్సవం

కార్మికుల హక్కుల సాధనకు సార్వత్రిక సమ్మె



నిరసన చేపడుతున్న ఆటో కార్మికులు, చిల్లర వర్తకులు

సీతంపేట : కార్మికుల హక్కుల సాధనకు వచ్చే నెల 9న దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఆటో డ్రైవర్లు, చిల్లర వర్తకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా కేంద్ర ప్రభుత్వం మార్చి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా రైతాంగానికి గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తూ, బడా కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెడుతున్నాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ఆటోడ్రైవర్లు అండ్ మోటార్ కార్మికులకు వాహనమిత్ర రూ.15వేలు ఇస్తామని, జరిమానాలు పెంచే జీవోలు 21, 31 రద్దు చేస్తామని, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, గ్రీన్ టాక్స్ రద్దు చేస్తామని హామీలు ఇచ్చారని.. ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని మండిపడ్డారు. ఇప్పటికై నా చంద్రబాబునాయుడు ఆటోడ్రైవర్లు, మోటారు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు



లలితాపీఠంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన కర పత్రాలను పీఠంలోని వారాహిదేవి సన్నిధిలో పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 4:30 గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకం, సాయంత్రం 7కు సహస్రనామార్చన, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఈ నెల 29(ఆదివారం)న వారాహి హోమం చేయనున్నట్లు వెల్లడించారు. నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తులు, అమ్మవారికి చీర ధరింపదలచిన వారు, ప్రసాద వితరణలో పాల్గొనదలచిన వారు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

భారీ అన్నసమారాధన



అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

అగనంపూడి: మాస శివ రాత్రిని పురస్కరించు కొని 86వ వార్డు పెదమడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష అన్న సమారాధన చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీగణేష్ మోటార్స్ సంస్థ యజమాని తిరుపతి నాయుడు, రమాదేవి దంపతుల ఆర్థిక సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అమరపిని సోమునాయుడు, దానబాల అప్పలనాయుడు, కొలిపాక అప్పారావు, దొడ్డి దేముడు, కండేపల్లి పైడిరాజు, గుదే అప్పలరాజు, లోవరాజు, కరణం సన్ని, విందుల వరహాలు, ఎల్.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి దేవన్‌రెడ్డి పరామర్శ



అప్పారావును పరామర్శిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త సారిపిల్లి అప్పారావును మంగళవారం వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయ కర్త తిప్పల దేవన్‌రెడ్డి పరామర్శించారు. జీవీఎంసీ 64వ వార్డు యాతపాలెంలో ఉంటున్న అప్పారావు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న దేవన్‌రెడ్డి ఆయన్ను పరామర్శించారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, జీవీ రమణారెడ్డి, అన్నవరం, ఈశ్వరరావు ఉన్నారు.

టెన్త్‌లో ప్రతిభా వంతులకు సత్కారం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న సీఐ పార్థసారథి

గాజువాక: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన ఇద్దరు విద్యార్థులను స్థానిక ప్రాఫిట్ షూ కంపెనీ ప్రతినిధులు సత్కరించారు. పదో తరగతి పరీక్షల్లో 585 మార్కులు సాధించిన నవ్యశ్రీ, 580 మార్కులు సాధించిన వెన్నెలకు గాజువాక సీఐ పార్థసారథి చేతుల మీదుగా సత్కరించి ప్రోత్సాహకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఘన విజయాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రసన్నను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో షోరూమ్ ప్రతినిధులు ఎల్లపు రాము, గుడివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి కాకతీయలోవలో దుర్గాదేవి అమ్మవారి మారు వారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన ను 65వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు ప్రారంభించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ నాగిశెట్టి శ్రీను, ఆలయ ధర్మకర్త శ్రీహరి, ప్రతినిధులు ఇరోతి గణేష్, సన్యాసిరావు, సత్తిబాబు ఏర్పాట్లు చేశారు.